

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 287 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శనివారం 11 జనవరి 2025 | వెల : 4/-



## అ నోట్లు ఎక్కడ?

- మిస్టరీగా మారిన రూ.6,700 కోట్లు..
- ఇప్పటికీ తిరిగి రాని నోట్లు..
- రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి ఏడాదిన్నర దాటింది.
- భారతదేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో రూ.2000 నోట్లను డిపాజిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశం
- 2024 నాటికి రూ.6,691 కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ అధికారిక గణాంకాలు

### అద్భుతాలు చేసే వారు

# మాతో రండి

- రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా చేయడమే తమ లక్ష్యం
- హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన
- హైటెక్ సిటీలో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం
- చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం
- అవుటర్ రింగ్ రోడ్డు-రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తాం



హైదరాబాద్

పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో కలిసి కంపెనీలు ముందుకు వస్తే అద్భుతాలు చేయవచ్చన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా చేయడమే తమ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా చెప్పుకొచ్చారు. శుక్రవారం హైటెక్ సిటీలో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఈవీ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెట్టామన్నారు. ఆయా వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు ట్యాక్స్ తొలగించామని వివరించారు. హైదరాబాద్ సిటీని వరదలు లేని నగరంగా తీర్చి దిద్దాలన్నదే తమ ఆలోచనగా చెప్పుకొచ్చారు - మిగతా3లో



## ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన


- నల్లగొండ - వరంగల్ - ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి
- కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య
- కరీంనగర్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ - మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. నల్లగొండ - వరంగల్ - ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి, కరీంనగర్ - నిజామాబాద్ - మిగతా3లో

### ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై

## హైకోర్టు అసంతృప్తి



- ఆ షోలు రద్దు చేశామంటూ మళ్లీ ఏంటిది..
- బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటి
- ఇకపై బెన్‌ఫిట్‌షోలకు అనుమతించేది లేదని స్పష్టం
- అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలి
- హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్

గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను - మిగతా3లో



### మహారాష్ట్రలో బీజేపీ విజయానికి

## ఆర్ఎస్ఎస్ ప్రధాన కారణం

- గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి ఆర్ఎస్ఎస్ పని విధానం, దాని దూకుడు
- హిందూత్వ ప్రచారం వంటివి కీలక స్తంభాలు
- అందుకే 149 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 132 సీట్లు గెలుచుకున్నది
- శరద్ పవార్ ప్రశంస

# టార్గెట్ కేసీఆర్...

## రేవంత్ వ్యూహం అదేనా?

హైదరాబాద్

తెలంగాణలో ఎన్నికలు ముగిసి ఏడాది గడిచినా.. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యద్ధం ఆగడం లేదు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కమిషన్ వేవారు. తర్వాత విద్యుత్ కొనుగోలు ఒప్పందంపైనా విచారణ కమిషన్‌ను నియమించారు. ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగు చూసింది. వీటితో రేవంత్ సర్కార్ కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావును ఇరుకున - మిగతా3లో





### ఎక్కువ రేటుకు టిక్కెట్లు అమ్మితే...

## తాట తీస్తాం

- తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇష్టారాజ్యంగా టికెట్ రేట్లు పెంచేసి.. ప్రయాణికుల్ని గుల్ల చేస్తుంటారు.
- అధిక ధరలకు బస్సు టికెట్లు విక్రయించినట్లు తెలిస్తే.. ఆయా బస్సుల్ని సీజ్ చేస్తామంటూ హెచ్చరికలు
- తెలంగాణ ఆర్టీసీ ప్రజల సౌకర్యార్థం ఏకంగా.. 6,432 ప్రత్యేక బస్సులను టీజీఆర్టీసీ నడపేందుకు నిర్ణయం

హైదరాబాద్

సంక్రాతి వచ్చిందంటే.. బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ హడావిడి ఏ తీరుగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అవకాశం వచ్చింది కదా అని అందిన కాడికి దండుకునేందు సిద్ధమైపోతుంటారు. ఇష్టారాజ్యంగా టికెట్ రేట్లు పెంచేసి.. ప్రయాణికుల్ని గుల్ల చేస్తుంటారు. కానీ.. ఇకపై అలా వీలు కాదంటున్నారు? తెలంగాణ రవాణా, బీసీ - మిగతా3లో



## ఈ నెల 28 దాకా హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

### హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును అరెస్టు చేయవద్దన్న మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టును పొడిగించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి గాదగోని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసుపై తాజాగా హైకోర్టు విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని చక్రధర్ గౌడ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు హరీశ్‌రావును అరెస్టు చేయవద్దనే ఉత్తర్వులను పొడిగించింది. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, తనపై బెదిరింపులకు పాల్పడ్డారని గత నెల 1వ తేదీన సిద్దిపేటకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నేత గాదగోని చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో 120(బీ), 386, 409, 506ఆర్/డబ్ల్యూ, 34ఐపీసీ, 66 ఐటీ యాక్ట్ ప్రకారం హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని హరీశ్‌రావు అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. హరీశ్‌రావు పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఆయన్ను అరెస్టు చేయరాదని పోలీసులను ఆదేశించింది. హరీశ్‌రావుపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోరాదని కూడా పంజాగుట్ట పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

# భారత కూటమిలో బీటలు

**న్యూఢిల్లీ :** భారత కూటమిలో వచ్చిన బీటలు ఇప్పుడిప్పుడే బయటపడ్డాయి. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ తర్వాత, ఇప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఇందులో ఎజెండా లేదా నాయకత్వం లేదని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమి సభ్యులందరినీ సమావేశానికి పిలవాలని ఆయన అన్నారు. ఈ కూటమి లోక్‌సభ ఎన్నికలకే పరిమితమైతే దానిని త్వరలో ముగించాలన్నారు. కానీ అది అసెంబ్లీ ఎన్నికలు కూడా అయితే, మనం కలిసి కూర్చుని కలిసి పనిచేయాల్సి ఉంటుందని అబ్దుల్లా ఇక్కడ విలేకరులతో అన్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇండియా బ్లాక్‌లో చీలిక తెరపైకి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి సహా అనేక పార్టీలు కాంగ్రెస్‌ను దాటవేసి ఆప్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇండియా బ్లాక్ లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే అని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ, తనకు గుర్తున్నంత వరకు దానికి ఎటువంటి కాలపరిమితి నిర్ణయించబడలేదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు అన్నారు. సమస్య ఏమిటంటే ఇండియా బ్లాక్ సమావేశాన్ని పిలవలేదు.ప్రధాన నాయకత్వం, పార్టీ లేదా భవిష్యత్తు వ్యూహం (ఇండియా బ్లాక్‌లో) ఎజెండా గురించి స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. పొత్తు కొనసాగుతుందా లేదా అనేది కూడా స్పష్టంగా లేదు. బహుశా ఢిల్లీ ఎన్నికల తర్వాత, ఇండియా బ్లాక్ సభ్యులను సమావేశానికి పిలిపించి, అప్పుడు పరిస్థితి స్పష్టమవుతుందని అబ్దుల్లా అన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఢిల్లీ ఎన్నికలకు ముందు ఆప్ కు పెరుగుతున్న మద్దతు గురించి మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ, "ఢిల్లీ ఎన్నికలతో మాకు ఎటువంటి సంబంధం లేదు కాబట్టి నేను ఇప్పుడే దాని గురించి ఏమీ చెప్పలేను" అని అబ్దుల్లా అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు బిజెపిని ఎలా బలంగా ఎదుర్కోవాలో నిర్ణయిస్తాయి. గతంలో కూడా ఢిల్లీలో ఆప్ రెండుసార్లు విజయం సాధించిందని అబ్దుల్లా పేర్కొంటూ, "ఈసారి ఢిల్లీ ప్రజలు ఏమి నిర్ణయిస్తారో వేచి చూడాలి" అని అన్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా అలయన్స్ ఓటమి తర్వాత, ఇండియా అలయన్స్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం గురించి ప్రశ్న లేవనెత్తుతూ ఇండియా బ్లాక్‌కు నాయకత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ తర్వాతే ఇండియా బ్లాక్ గురించి చర్చ మొదలైంది.



### మోడీ చెప్పినట్టుగానే...

ఇండియా కూటమికి బీటలు వారాయి అని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహార సాగుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల వరకే ఇండియా కూటమి అని అనుకుంటే తప్పనిసరిగా దాని మూసివేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి వ్యూహాలు రచించకపోవడం.. ఒకవేళ అవి రచించినా అమల్లో పెట్టకపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రీయ జనతా నేత తేజస్వి యాదవ్ ఇండియా కూటమిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంటు ఎన్నికల వరకే ఇండియా కూటమి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలు తమ అవసరాల దృష్ట్యా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చని పేర్కొన్నారు. కలిసి పోటీ చేయాలని సందర్భం వచ్చినప్పుడు.. ఒంటరిగానే ఎన్నికల బరిలో ఉండి.. తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవచ్చని పేర్కొన్నారు. తేజస్వి యాదవ్ ఈ వ్యాఖ్యలు చేయడంతో? జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. " ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇకపై ఆ కూటమి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. ఈ లెక్కన చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు నిజమవుతున్నాయి. ఇవే గనుక మునుముందు కొనసాగితే దేశంలో బలమైన ప్రతిపక్షం అంటూ ఉండదు. మోడీ ఆడుతున్న గేమ్లో ఇండియా కూటమి చిక్కి విలవిలలాడిపోవడం అత్యంత దారుణమని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి గుడ్ న్యూస్.. బెయిల్ మంజూరు



హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై దాఖలైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ క్రమంలో పూణేలోని ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరైన తర్వాత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌కు రూ.25,000 పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సీనియర్ కాంగ్రెస్ నేత మోహన్ జోషి కోర్టులో పూచీకత్తుగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకుడికి కోర్టు ముందు హాజరు కావడానికి శాశ్వత మినహాయింపు ఇచ్చిందని గాంధీ తరపున వాదించిన న్యాయవాది మిలింద్ పవార్ అన్నారు. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 18న జరుగుతుందని పవార్ తెలిపారు. సావర్కర్ మనవడు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. మార్చి 2023లో లండన్‌లో గాంధీ చేసిన ప్రసంగానికి సంబంధించినది. రాహుల్ తన ప్రసంగంలో స్వాతంత్ర్య సమరయోధుడు రాసిన పుస్తకం గురించి కొన్ని వ్యాఖ్యలు చేశారు.

# దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం..

## చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ



ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.

వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్అండ్‌టీ చైర్మన్ ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

# జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ బీజేపీలో చేరిక

'మేము తిరిగి వస్తామనే నినాదంతో జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘువర్ దాస్ ఈరోజు బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ దాస్ రెండోసారి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత, రఘువర్ దాస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఒడిశా గవర్నర్ పదవికి రాజీనామా చేయడం ద్వారా, ఆయన ఇప్పుడు తన పాత పాత్రకు తిరిగి వస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా ఉండటం గౌరవానికి సంబంధించిన విషయమన్నారు.

### కొత్త ఏడాది.. కొత్త ఉత్సాహంతో

2024 సంవత్సరం నుంచి పాఠాలు నేర్చుకుంటూ 2025 కొత్త సంవత్సరంలో కొత్త శక్తి, కొత్త ఉత్సాహం, కొత్త ఉత్సాహంతో, అందరూ బీజేపీ కార్యకర్తలు ప్రజా ప్రయోజనాల కోసం పోరాడి విజయం సాధించాలని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జనవరి 10 తనకు చారిత్రాత్మకమైన రోజు అని రఘువర్ దాస్ అన్నారు. 1980లో ఈ రోజున, ఆయన బీజేపీలో ప్రాథమిక సభ్యుడయ్యారు. ఇప్పుడు ఆయన రెండో సారి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారు. తాను గవర్నర్‌గా నియమితుడైనప్పుడు, 2023 అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాను కలిసి తన రాజీనామాను సమర్పించినప్పుడు, అది తన జీవితంలో చాలా భావోద్వేగ క్షణం అని ఆయన అన్నారు.



### గెలుపు, ఓటములు


రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు ఉంటాయని రఘువర్ దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గెలుపు, ఓటమి జీవితంలో ఒక భాగమని అన్నారు. 1984లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు ప్రతిపక్షాలు 'హమ్ దో హమారే దో' అని ఎగతాళి చేశాయని, ఆ రోజును ప్రజలు చూశారని పేర్కొన్నారు. కానీ మీ అందరికీ తెలుసు, ఇప్పుడు బీజేపీ దేశాన్ని అంతిమ స్థాయికి తీసుకెళ్లే దిశగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం మనకు ఒక సాధనమని ఆయన అన్నారు. ఈ కారణంగా ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. నేడు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశంలోని 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని రఘువర్ దాస్ తెలిపారు.

### కొన్ని నెలల తర్వాత పోరాటం

జార?ండ్ ప్రజలు ఇచ్చిన ఆదేశాన్ని తాను గౌరవిస్తున్నానని మాజీ ముఖ్యమంత్రి రఘువర్ దాస్ అన్నారు. జార?ండ్ ప్రజలు ఇండియా అలయన్స్ ప్రభుత్వానికి పాలించడానికి మెజారిటీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఆధారంగా ఇండియా అలయన్స్‌కు ఆధిక్యం లభించిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆయన అన్నారు. సంకీర్ణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి పార్టీ కొన్ని నెలలు మాత్రమే వేచి చూస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో లేకపోతే బీజేపీ వీధుల నుంచి సభ వరకు ప్రజా ప్రయోజన అంశాలపై వాగ్దానాలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్ర రాయ్, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, ఎంపీ మనీష్ జైస్వాల్, రాజ్యసభ ఎంపీ ఆదిత్య సాహు, మాజీ ప్రతిపక్ష నాయకుడు అమర్ బౌరి, ఎమ్మెల్యే సహా అనేక మంది బీజేపీ నేతలు నీరా యాదవ్, అలోక్ చౌరాసియా సహా పలువురు హాజరయ్యారు.

## మహారాష్ట్రలో బీజేపీ విజయానికి ఆర్ఎస్ఎస్ ప్రధాన కారణం..



ముంబై: ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను ఆయన ప్రశంసించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అనూహ్య విజయానికి ఆ సంస్థ ప్రధాన కారణమని అన్నారు. ముంబైలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి శరద్ పవార్ మాట్లాడారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి ఆర్ఎస్ఎస్ పని విధానం, దాని దూకుడు, హిందూత్వ ప్రచారం వంటివి కీలక స్తంభాలని తెలిపారు. అందుకే 149 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 132 సీట్లు గెలుచుకున్నదని అన్నారు. కాగా, అంకితభావంతో పనిచేసే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బీజేపీ విజయానికి ఒక ఉదాహరణ అని శరద్ పవార్ తెలిపారు. అట్టడుగుస్థాయి వరకు ఆ సంస్థ కీలకంగా పని చేసిందని ఆయన కొనియాడారు. 17 కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు, ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ఓటు బ్యాంకు విశ్వాసాన్ని బీజేపీ తిరిగి పొందడం కూడా ఎన్డీయే విజయానికి కారణాలని అన్నారు.

## అ నోట్లు ఎక్కడ?




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి ఏడాదిన్నర దాటింది. అయితే 1.88 శాతం కరెన్సీ నోట్లు ఇంకా వెనక్కి రాలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనవరి 1, 2025న అధికారికంగా ప్రకటించింది. ఆర్‌బీఐ డేటా ప్రకారం, తిరిగి రాని కరెన్సీ నోట్లు రూ.6,691 కోట్లు ఉందని తెలిపింది. 2023లో రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకున్నారు. తదనంతరం, భారతదేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో రూ.2000 నోట్లను డిపాజిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను బ్యాంకులతో పాటు ప్రభుత్వ ఆమోదం పొందిన స్థలాల్లో డిపాజిట్ చేశారు. ఈ పథకం చెలామణిలో ఉన్నప్పుడు మొత్తం రూ.2000 నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇది డిసెంబర్ 31, 2024 నాటికి రూ.6,691 కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ అధికారిక గణాంకాలు తెలిపాయి. అంటే చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.12 శాతం తిరిగి వచ్చినట్లు ఆర్బీఐ ప్రకటించింది. దానికి సంబంధించి రూ.2 వేల నోట్లలో 1.88 శాతం తిరిగి రాలేదు. ఆర్‌బీఐ అధికారిక గణాంకాల ప్రకారం దీని విలువ రూ.6,691 కోట్లు.

### ప్రింటింగ్ నిలిపివేత

గతంలో 2018-19లో రూ.2 వేల నోట్ల ముద్రణ నిలిచిపోయింది. అంటే రూ.1000, రూ.500 నోట్ల రద్దు తర్వాత ప్రజలకు డబ్బులు అందడంలో ఇబ్బంది ఏర్పడింది. ఈ క్రమంలోనే రూ.2 వేల నోట్లను ప్రవేశపెట్టారు. ఈ లక్ష్యం నెరవేరిన తర్వాత రూ.2వేల నోట్ల ముద్రణ నిలిపివేసింది.

## ఉగ్రవాదులున్న జైలు వద్ద డ్రోన్.. 8 రోజుల తర్వాత గుర్తింపు




**భోపాల్:** ఉగ్రవాదులను ఉంచిన జైలు వద్ద డ్రోన్ ల్యాండ్ అయ్యింది. కెమెరాలున్న దీనిని 8 రోజుల తర్వాత భద్రతా సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ జైలులోని భద్రతా ప్రమాణాలపై విమర్శలు వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. అక్కడి కేంద్ర కారాగారంలో కరుడు గట్టిన 69 మంది ఉగ్రవాదులను ఉంచిన ప్రత్యేక సెల్ బీ బ్లాక్ సమీపంలో ఒక డ్రోన్ పడి ఉంది. జనవరి 8న భద్రతా సిబ్బంది దీనిని గుర్తించారు. కాగా, కెమెరాలున్న చైనా తయారీ డ్రోన్ భోపాల్ జైలు వద్ద కనిపించడం కలకలం రేపింది. డిసెంబర్ 31న అది అక్కడ ల్యాండ్ అయినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా భద్రతా సిబ్బంది తెలుసుకున్నారు. గత ఎనిమిది రోజులుగా జైలు ప్రాంగణంలో ఆ డ్రోన్ ఉన్నప్పటికీ ఎవరూ గమనించలేదు. ఈ నేపథ్యంలో ఆ జైలులో భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు ఆ డ్రోన్ యజమాని స్థానిక డాక్టర్ స్వప్నిల్ జైన్‌గా పోలీస్ అధికారులు గుర్తించారు. అతడి కుమారుడి కోసం కొన్న ఆ డ్రోన్ డిసెంబర్ 31న నియంత్రణ కోల్పోయి జైలు సమీపంలో పడినట్లు తెలుసుకున్నారు. కాగా, ఐఎస్‌వో సర్టిఫైడ్ భోపాల్ జైలులో జామర్లు, సీసీటీవీలు సహా బహుళ స్థాయి భద్రత ఉన్నప్పటికీ వారం రోజులకు పైగా ఆ డ్రోన్‌ను భద్రతా సిబ్బంది గుర్తించకపోవడం ఆందోళన రేపింది. ఈ నేపథ్యంలో జైలు వద్ద భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జైలు, పరిసర ప్రాంతాలను 'నో-ఫ్లై జోన్'గా పరిగణించాలని యోచిస్తున్నది.

## 'ఇండియా' బ్లాక్ శాశ్వతం..

### కేవలం ఎన్నికల్లో పోటీ కోసం కాదు: ఫరూక్ అబ్దుల్లా



**శ్రీనగర్:** ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ శాశ్వతమని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం తలపడుతున్నాయి. ఈ కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం సూచించారు. కాగా, ఈ పరిణామాల నేపథ్యంలో 'ఇండియా' కూటమి భవిష్యత్తు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఈ కూటమి శాశ్వతం. ఇది ప్రతి రోజు, ప్రతి క్షణానికి సంబంధించినది' అని అన్నారు. అయితే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో పోరాటం చేయదని తెలిపారు. జమ్ముకశ్మీర్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# మణికొండ మున్సిపాలిటీలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలి

**జలమండలి అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేసిన బీఆర్ఎస్ నాయకులు**



**గండిపేట్,జనవరి10** మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని జలమండలి అధికారులను కోరారు.శుక్రవారం సీతారాం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసికట్టుగా ఖైరతాబాద్ వద్ద గల జలమండలి కార్యాలయానికి వెళ్లి మంచినీటికి సంబంధించిన ప్రజా సమస్యలను అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ...స్థానిక ప్రజల అవసరం మేరకు మంచినీటి సరఫరా లేదనీ వారు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్య పరిష్కారం, రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి తట్టుకొని, పరిస్థితికి తగ్గట్టు నీటి సరఫరా ట్యాంకర్ లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఖిజ్రా కాలనీ,గోల్కొండ హిల్స్,నెక్నంపూర్,నెమలి నగర్ తది తర ప్రాంతాలలో నీటి సరఫరా పైప్ లైన్లు పూర్తిగా ఏర్పాటు చేయాలని,అల్కాపుర్ స్పోర్ట్స్ పార్క్ లో గల 2.5 ఎంఎల్.డి,కృష్ణారెడ్డినగర్ 0.5 ఎంఎల్.డి సామర్థ్యం గల రిజర్వాయర్ లు నిరూపయోగంగా ఉన్నాయని,సామర్థ్యం మేర నీటి సరఫరా జరుగడం లేదనీ అన్నారు.నెమలినగర్ లో రిజర్వాయర్ కట్టడానికి స్థలం ఉన్నను కట్టలేదని తెలిపారు.ప్రజల వద్ద నుండి డ్రైనేజీ సిస్తు వసులు చేయడం మాత్రమే జలమండలికి తెలుసని అందుకు తగ్గట్టు ప్రజా సౌకర్యార్థం పనులు జరపకుండా మున్సిపాలిటీ వారిపై నెట్టడం,పై విషయాలన్నీ జలమండలి అధికారి మయాంక్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈ.డి) దృష్టికి తీసుకెళ్ళడం, ప్రజా సౌకర్యార్థం పనులు మెరుగు పరచాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారానికి తాము బీఆర్ఎస్ తరపున పనిచేస్తామని వెల్లడించారు.అన్ని వసతుల ను ప్రజలకు చేరువ చేసేందుకు చర్యలు చేపడుతామని వెల్లడించారు.ఈ మేరకు అధికారులు సానుకూలత వ్యక్తం చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, గుట్టమీధి నరేందర్,అందె లక్ష్మణ్ రావు,గోరుకంటి విఠల్, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి,ఏర్పుల శ్రీకాంత్, ఆరీఫ్ మొహమ్మద్,అష్ఫాక్ అలి,సుమనళినీ, తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి







**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్**

**రాజేంద్రనగర్,జనవరి10** ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ అన్నారు.శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని,సర్వే జరిగే సమయంలో ప్రజలు అందు బాటులో ఉండే విధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేసేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు.సర్వే వేగవంతంగా జరిగేందుకు చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ నెలాఖరులోపు సర్వేను పూర్తి చేయాలని అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. సర్వే పారదర్శకంగా కొనసాగాలని ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి లబ్ది చేకూర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సర్కిల్ బిల్ కలెక్టర్లు, ఇంద్రమ్మ సర్వే సిబ్బంది,తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

**రైతులు లాభసాటి పంటలను సాగు చేయాలి**


**సత్తుపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ, సింగరేణి వ్యవసాయ గోదాం పనులకు శంకుస్థాపన, కో ఆపరేటివ్ సొసైటీ, జి.పి. భవనాలను ప్రారంభించిన మంత్రి తుమ్మల**



**ఖమ్మం:** రైతాంగ సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మంత్రి సత్తుపల్లి మండలంలో పర్యటించి సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ తో కలిసి పలు రోడ్డు నిర్మాణ, సింగరేణి వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, కో ఆపరేటివ్ సొసైటీ, జి.పి. భవనాలను ప్రారంభించారు. బుగ్గపాడు గ్రామంలో బుగ్గపాడు ఆర్ అండ్ బి రోడ్డు నుండి నాగుపల్లి ఆర్ అండ్ బి రోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులకు, కాకర్లపల్లి గ్రామంలో బి.టి., సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి కాకర్లపల్లి గ్రామంలో నిర్మించిన కోపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగూడెం- పాల్వంచ ప్రాంతంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఈ నెలలో బృందం పర్యటన కూడా ఉంటుందని అన్నారు. పొలాలకు నీరు, పిల్లలకు చదువు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించిందని అన్నారు. బేతుపల్లి కాలువ తన హయాంలో పూర్తి చేశామని, వేంసూరు మండలం నేడు పచ్చగా తయారయిందని అన్నారు. ఆ మండలంలో యువత అమెరికాలో సంపాదించి నేడు హైదరాబాదులో సాఫ్ట్ వేర్ కంపెనీలు ప్రారంభించారని , 40 ఏళ్ళ క్రితం త్రాగునీరు లేని గ్రామాలు నేడు పంటల మయం చేశామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్త వ్యవసాయ సహకార సంఘాలు అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించారు. సహకార సొసైటీలను బలోపేతం చేయడం ద్వారా ఎరువులు, గోదాములే కాకుండా యంత్ర సామాగ్రి కూడా అందించే కార్యక్రమం శ్రీకారం చుడుతున్నామని అన్నారు. రైతుల ముఖాలలో చిరునవ్వు ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారని, రైతు బీమా క్రింద 3 వేల కోట్లు, రైతు బంధు క్రింద 7600 కోట్లు అందించారని అన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా క్రింద రైతుల ఖాతాలలో దాదాపు 10 వేల కోట్లు జమ చేయబోతున్నామని అన్నారు. రాబోయే పంట సీజన్ నుంచి రైతులకు పూర్తి స్థాయిలో పంట బీమా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కష్టంగా ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం కోసం దాదాపు మొదటి సంవత్సరం 40 వేల కోట్లు ఖర్చు చేశామని, మార్చి లోపుల మరో 10 వేల కోట్లు రైతాంగ పథకాల కోసం ఖర్చు పెడతామని అన్నారు. అనంతరం సత్తుపల్లి మండలానికి చెందిన 59 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల తహసీల్దార్ యోగేశ్వర రావు, సొసైటీ అధ్యక్షులు, కార్యవర్గం సభ్యులు, సత్తుపల్లి పట్టణ, మండలం ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

**ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన మల్ రెడ్డి రామిరెడ్డి**



**తుర్కయంజాల్, జనవరి 10( సూర్య రేఖ)**ఆ భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని తెలంగాణ రోడ్డు భవనాల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి అన్నారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ దేవాలయంలో తెలంగాణ రోడ్డు భవనాల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి స్వయంభుగా వెలసిన శ్రీ రంగనాథ స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం అక్కడకు చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలందరికీ ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలందరు అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా గుడి చైర్మన్ నల్లబోలు అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మల్ రెడ్డి రామ్ రెడ్డి సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి, చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివలింగం గౌడ్, యువ నాయకులు వంగేటి గోపాల్ రెడ్డి, శ్రీ రంగనాథ స్వామి దేవాలయ చైర్మన్ నల్లబోల్లు అనిల్ రెడ్డి, దేవాలయ కమిటీ మెంబర్లు సంరెడ్డి, వెంకటరెడ్డి, భాలగొని భూషణ, మేకం ఎల్లయ్య, సుమలత, రమేష్, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు రమేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉండే ప్రాంతాలు..



**రాజేంద్రనగర్,జనవరి 10** కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గ్రీన్ విచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు లక్ష్మీగూడ,హౌసింగ్ బోర్డ్ కాలనీ,రాజీవ్ గృహకల్ప,వాంబే కాలనీ, బృందావన్ కాలనీ,గణేష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.

**హిమాయత్ సాగర్ సెక్షన్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్ ల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర సింగ్ తెలిపారు.హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు,మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

**కిస్మత్ పూర్ లో..**

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాక్ చర్చ్ విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీ సాయికాలనీ,ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్రకాలనీ,ఫైన్ ఆర్ట్స్ కాలనీ,ఎన్నారై టౌన్షిప్, రాధారియాల్టీ,వివేకానందకాలనీ,యాదాద్రికాలనీ, ఓంనగర్ కాలనీ,ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2,3,సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్,రాక్ చర్చ్,కృతి విల్లాస్,కిస్మత్పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన కిస్మత్పూర్, రాఘవేంద్ర కాలనీ,శివసాయికాలనీ,బాబమ్మ కాలనీ, మైత్రి కాలనీ,వినాయక నగర్ ,మారుతి కాలనీ, ఎస్సీ బస్తీ, శ్రీకృష్ణ కాలనీ, విల్లా గ్రీన్,ఆద్య విలాస్,ఓయెన్ ఎక్స్ విల్లాస్,గుహ శిల్పి, గిరి దారి అపార్ట్మెంట్, హనుమాన్ టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని చిన్న గోల్కొండ, ఏజీఎల్ విద్యుత్ లీడర్ల పరిధిలో శనివారం ఉదయం 10:00 నుండి సాయంత్రం 5 గంటల వరకు సంఘీ గూడ,చిన్న గోల్కొండ, రాయికుంట,అక్బర్ ఫామ్,బహదూర్ గూడ, హమీదుల్లా నగర్, రషీద్ గూడా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## అద్భుతాలు చేసే వారు మాతో రండి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి. చంద్రమండలానికి వెళ్తున్నామని, కానీ భూమిపై ఎలా ఉండాలో మాత్రం తెలుసుకోలేకపోతున్నామన్నారు. కాలుష్య కారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామని తెలిపారు.మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ రోడ్డు, రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు సీఎం. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామన్నారు. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు-రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని గుర్తు చేశారు.అభివృద్ధితోపాటు ఇక్కడ యువతకు ఉపాది కల్పించాలన్నది తమ ఉద్దేశంగా చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణలో ప్రతి ఏడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పట్టా పట్టుకుని బయటకు వస్తున్నారని, వారిలో ఎక్కువ మంది స్కిల్ ఉండలేదన్నారు. టాటా గ్రూప్‌తో కలిసి రూ. 2400 కోట్లతో రాష్ట్రంలో ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని గుర్తు చేశారు.నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, అందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించామని గుర్తు చేశారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలన్నారు.అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, రానున్న 50 ఏళ్ల కోసం ప్రణాళికలు రచిస్తున్నామని తెలియజేశారు.

# అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడో.?





**అధికారులు,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి ప్రాణాలు కోల్పోతున్న గగన్ పహాడ్ వాసులు..**

**జాతీయ రహదారి దాటాలంటేనే వణికిపోతున్న పాదాచారులు..**

**రెండేళ్ల క్రితమే అండర్ పాస్ బ్రిడ్జి మంజూరైనా చేపట్టకుండా సాగదీత..**

**మంజూరైన రోడ్డును పూర్తి చేయడం లేదంటూ ఆవేదన..**

**సమస్య పరిష్కరించాలని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన ప్రజలు..**

**పండగ తర్వాత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శంషాబాద్ సిఐ హామీ..**

**రాజేంద్రనగర్,జనవరి10** అధికారుల నిర్లక్ష్యం..పాలకుల అలసత్వం.. కారణంగా ప్రజల ప్రాణాలకే ముప్పొస్తుంది. రహదారుల గుండా ప్రయాణాలు చేయాలంటేనే జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఎన్ని జాగ్రత్తలు వహిస్తూ రోడ్లు దాటినా ఏదో ఒకచోట ఏదో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి ప్రాణం మీదికి తీసుకువస్తున్నాయి.అయినా అధికారులు,ప్రజాప్రతినిధులు ఎవరు స్పందించడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.నెలకు కనీసం రెండు, మూడు ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా ప్రాణాలను సైతం బలి తీసుకుంటున్నట్లు స్థానికంగా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నగరం నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారి, జాతీయ రహదారి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి నుంచి విస్తరించి ఉంది.ఈ క్రమంలో జాతీయ రహదారి మీద అడుగు పెట్టాలంటేనే స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.ఎటు నుంచి ఏ వాహనం ఢీకొడుతుందో,ప్రమాదం జరిగితే ప్రాణం పోతుందో,ప్రాణం మిగిలి కాళ్లు చేతులు పోతాయో అన్న ఆందోళనకు ప్రజలు గురవుతున్నారు.ఇంత ప్రమాదకరమైన ప్రయాణం ఎలా చేయాలంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా రోడ్డుపై అడుగు వేయాలంటేనే భయమేస్తుందని ప్రజలు తెలుపుతూ ఉండడం అందరిని ఆలోచనకు గురిచేస్తుంది.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి నుంచి శంషాబాద్ మీదుగా బెంగళూరు వెళ్లే వాహనాలు అతి ప్రమాదకరంగా వెళుతుండడంతో సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ వద్ద ప్రయాణాలు చేసేవారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.గతంలోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మించాలని నిర్ణయించారు.ఈ మేరకు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు,కానీ ఆ ప్రణాళికలు కాస్త కార్యరూపం దాల్చలేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేయాల్సిన అండర్ పాస్ బ్రిడ్జిలు ఎలా వేయకుండా వదిలేశారంటూ స్థానికులు ప్రశ్నలు కురిపిస్తున్నారు.ఇక ఏదో ఒక ప్రమాదం జరుగుతుండడంతో ఎలా తమ ప్రాణాలను కాపాడుకోవాలంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి మోక్షం ఎప్పుడో.?**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి నుంచి బెంగళూరు హైవే విస్తరించి ఉండటంతో స్థానికంగా పాదాచారులు ప్రయాణం చేయాలంటేనే జంకే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా అండర్ పాస్ నిర్మాణం చేపడితే పాదాచారులు రోడ్డు దాటడానికి జంకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు వివరిస్తున్నారు. అయితే స్థానికంగా గగన్ పహాడ్ వద్ద రోడ్డు దాటే క్రమంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలుపుతున్నారు. అయితే అండర్ పాస్ నిర్మిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని అధికారులు తెలుపుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు మాత్రం పడడం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.రెండేళ్ల క్రితం మంజూరైన రోడ్డుకు మోక్షం వస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని ప్రజలు భావిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**గగన్ పహాడ్ రోడ్డులో నిత్యం ఏదో ఒక ప్రమాదం..**

గగన్ పహాడ్ వద్ద ప్రమాదకరమైన జాతీయ రహదారిని దాటాలంటే ప్రజలకు వెన్నులో వణుకు పుడుతుంది.గతంలో ఈ రోడ్డు దాటే క్రమంలో అనేక ప్రమాదాలను స్థానికులు ఎదుర్కొన్నారు.దీంతో కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం కోల్పోయిన ఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. ఇటీవలే సూరెడ్డి రవీందర్ రెడ్డి అనే యువకుడు వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఇలా నెలలో కనీసం రెండు, మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వివరిస్తున్నారు.ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**అండర్ పాస్ నిర్మించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని రాస్తారోకో..!**

నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో గగన్ పహాడ్ ప్రజలు శుక్రవారం ఆందోళనకు దిగారు.అందులో భాగంగా బెంగళూరు హైవేపై ఆందోళన చేసి రాస్తారోకో చేపట్టారు.దీంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి.ఈ ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరినా అధికారులు స్పందించడం లేదంటూ వారు ఆందోళన తీవ్రతరం చేశారు.ఇలా ఎంతమంది ప్రాణాలు కోల్పోవాలంటూ వారి ఆవేదనను వెళ్లగక్కారు. నెలకు కనీసం మూడు ప్రమాదాలు జరిగి రెండు ప్రాణాలు పోతున్నారని అయినా అధికారులు ఎవరికీ పట్టడం లేదని మండిపడ్డారు.ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని రోడ్డుపైనే బైఠాయించారు.తీవ్రంగా ట్రాఫిక్ జామ్ కావడంతో శంషాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గగన్ పహాడ్ ప్రజలకు నచ్చజెప్పారు. పండుగ తర్వాత అధికారులతో చర్చించి సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు.ఈ మేరకు గగన్ పహాడ్ ప్రజలు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గగన్ పహాడ్ రోడ్డును ముట్టడించిన వారిలో గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాజీ కౌన్సిలర్ కిష్టయ్య గౌడ్,సరికొండ వెంకటేష్, శీలం తిరుపతి రెడ్డి,జోగి రవి,వి.నాగేష్, శ్రీధర్ గౌడ్,రత్నం,బాబ్‌జీ,ప్రవీణ్, శీలం జగన్మోహన్ రెడ్డి,గండయ్య, దేవుడు, తదితరులు ఉన్నారు.

## సంగయ్యపేట తాండ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**కొల్చారం,జనవరి10(సూర్య రేఖ)** కొల్చారం మండలం సంగయ్యపేట తండాలో ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని,విద్యార్థులు వివిధ రకాల రంగవల్లులు వేశారు.పాఠశాలలోని విద్యార్థులు సంక్రాంతి పండుగలో భాగమైన పతంగులని ఆనందంగా ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గ ప్రసాద్ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గ ప్రసాద్ బహుమతులను అందించారు.

## అధ్వానంగా మారిన పల్లె ప్రకృతి వనం...

**- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి....**



**కొల్చారం,జనవరి10(సూర్య రేఖ)** గ్రామాలలో ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పట్టించుకునే నాధుడు కరువయ్యాడు.కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో అధ్వానంగా పల్లె ప్రకృతి వనం మారింది.గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాల్లో అడుగు పెట్టే నాధులు కరువయ్యారు.గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రకృతివనాల వైపు పంచాయతీ సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు.పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసేందుకు ఎంతో హడావుడి చేసిన అధికారులు నిర్వహణపై దృష్టి సారించలేకపోతున్నారా,గత ప్రభుత్వంలో ఎన్నో వివాదాలు తట్టుకొని ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు.అవి ఇప్పుడు తాగుబోతులకు అడ్డాలుగా మారాయి.గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.ఇక గ్రామ పంచాయతీ కార్యదర్శులు అయితే కన్నెత్తి చూడడం లేదు.ఏదో మొక్కలు నాటామా వదిలేసామా అన్న రీతిలో కనిపిస్తున్నాయి.పిల్లలతో సేదతీరుదామని వస్తే వారికి మందు సీసాలు విరిగిపోయిన కుర్చీలు దర్శనమిస్తున్నాయి.ఇకనైనా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్లో 8 వ వార్షికోత్సవ వేడుకలు



**తుర్కయంజాల్,జనవరి10(సూర్య రేఖ)**తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ 8వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్,జేఎన్ టీయూ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులు నృత్యాలు,పాటలతో అలరించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ..విద్యాసంస్థలు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు.విద్యార్థుల ప్రతిభను వెలికి గుర్తించి ఆయా రంగాలలో పిల్లలను ముందుకు తీసుకుపోవాలన్నారు.పిల్లలకు ఫోన్లలో ఫేస్ బుక్ లో కంటే టెక్స్ట్ బుక్ లను అలవాటు చేయాలన్నారు.పెద్ద పెద్ద చదువులు చదివి వారి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ సుధీర్,సెక్రటరీ రాఘవరెడ్డి,డైరెక్టర్లు సంజీవరెడ్డి,పరీక్షిత్ రెడ్డి,ప్రధానోపాధ్యాయురాలు ప్రియ డామిన్,ఉపాధ్యాయులు,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు కబ్జా చేస్తే కబ్జాదారుల గుండెల్లో రైళ్లే


**కన్నెర్ర చేస్తున్న హైడ్రా**

**మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బచ్చి గళ్ళ రమేష్**



**తుర్కయంజాల్,జనవరి10(సూర్య రేఖ)** తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మాసబ్ చెరువు పరిరక్షణ సమితి చెరువును సందర్శించడం జరిగింది.ఈ నెల 8వ తేదీన హైడ్రా కమీషనర్ రంగనాథ్,అధికారులతో కలిసి మాసబ్ చెరువును సందర్శించారు.తుర్కయంజాల్ మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బచ్చి గళ్ళ రమేష్ శుక్రవారం మాట్లాడుతూ..గత రెండు సంవత్సరాల క్రితం చాలా వర్షపాతం వల్ల చెరువు పూర్తిగా నిండిన సమయంలో సర్వే నెంబర్ 205 యజమానులు చెరువులో మట్టిని పోసి పూడ్చారన్నారు.ఈ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన అనేక పార్టీల నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మాసబ్ చెరువు పరిరక్షణ సమితిగా ఏర్పాటు చేసి మూడు నెలలు రాత్రింబవళ్లు ఉద్యమాలు చేసి చివరాఖరుకు హైకోర్టును ఆశ్రయించి ఆ పనులు ఆపడం జరిగిందన్నారు.కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అన్ని చెరువులు కబ్జా గురవుతున్నట్టు గుర్తించి, కబ్జాడారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే విధంగా పని చేయాలని చెప్పారు.మాసబ్ చెరువు పరిరక్షణ సమితి గత సంవత్సరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.అలాగే వినాయక చవితి సందర్బంగా విగ్రహాలను చెరువుల వేసి విగ్రహాలకు సంబంధించిన ముడి పదార్థాల చెత్తను తీసివేయమని,గత రెండు సంవత్సరాల నుండి స్థానిక కమిషనర్లకు ఎన్ని సార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదన్నారు.కానీ ఈ మధ్య మాసబ్ చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాత్ వారి సహచర అధికారులు కమిటీ సభ్యులకు ఎవరికీ కూడా సమాచారం ఇవ్వకుండా చెరువును సందర్శించడం జరిగిందన్నారు.చెరువును కబ్జాదారుల నుండి రక్షిస్తారని ఇదే విషయమై రేపు స్థానిక శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని మరోసారి హైడ్రా కమీషనర్ రంగనాథ్ కలవడానికి మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ సిద్ధంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్,కోశికె ఐలయ్య,కొంతం యాదిరెడ్డి,కళ్యాణ్ నాయక్,బొక్క వంశీధర్ రెడ్డి,అరుణ్ కుమార్,గుత్త మహేందర్ రెడ్డి,వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం..



**ఉప్పల్,జనవరి10(సూర్యరేఖ)** తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా (టీఎన్జీవో) ఉప్పల్ ఆర్టీఓ కార్యాలయంలో ఉద్యోగుల సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆఫీసు ఉద్యోగులు,సిబ్బంది పాల్గొని,సంఘం లక్ష్యాలను పూర్ణంగా అనుసరించేందుకు తమ అంగీకారం ప్రకటించారు.ఈ ప్రచారాన్ని ఉద్యోగుల జేఏసి చైర్మన్, జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాశ్,అసోసియేట్ అధ్యక్షులు శామ్యూల్ పాల్,కార్యదర్శి భారత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారు ఉద్యోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి సభ్యత్వం పొందడం వల్ల వచ్చే ప్రయోజనాలు,సమస్యలపై చర్చలు నిర్వహించారు. ఉద్యోగుల హక్కులు సాధించడం,వారి విధి విధానాలను మెరుగుపరచడం ముఖ్యమైన అంశాలుగా సంఘం నేతృత్వం చెప్పారు.ఈ సందర్భంగా ఆర్టీఓ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది, అధ్యక్షుడు, కార్యదర్శికి సన్మానం చేశారు, జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల సంక్షేమం కోసం వారి నిరంతర కృషికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షులు బి.రవి ప్రకాశ్ మాట్లాడుతూ...ఆర్టీఓ సిబ్బంది అందించిన ఉత్కృష్ట స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపారు.ఆయన, ఉద్యోగుల అనేకకాలాల సమస్యలను పరిష్కరించడానికి సంఘం పనిచేస్తున్నట్లు తెలియజేసి,ఉద్యోగుల అభ్యర్ధనలు,సమస్యలు సంబంధిత అధికారుల వద్ద చేరి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తిగా ఉద్యోగులందరిని సంఘంలో చేరి, సంఘం బలాన్ని పెంచడంలో భాగస్వాములుగా ఉండాలని అభ్యర్థించారు.

సూర్య



# వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జనవరి10(సూర్యరేఖ)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిల్కానగర్ డివిజన్ బీరప్పగడ్డ శ్రీ తేనె లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఉప్పల్ కనిగిరి వెంకటేశ్వర స్వామి ఆలయం, ఉప్పల్ శ్రీరామకాలనీలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయాలలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పం శ్రీనివాస్, ఎదుల్ల కొండల్ రెడ్డి, కోకొండ జగన్,బాచుపల్లి నిరంజన్,జెట్టా కిషోర్, శ్రీనివాసరెడ్డి,పంగ మహేందర్ రెడ్డి,చింతల నరసింహా రెడ్డి, దేవాలయ నిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు






**ఉప్పల్,జనవరి10(సూర్యరేఖ)** రామంతపూర్ లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను సీనియర్ కాంగ్రెస్ నాయకులు బద్దం మోహన్ రెడ్డి,రాష్ట్ర యూత్ మాజీ కార్యదర్శి గడ్డం రవికుమార్,ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ పూజారి పావని రెడ్డి,జన్నంపల్లి వెంకటేశ్వర రెడ్డి,సుధాకర్ రెడ్డి,తవిడి బోయిన గిరిబాబు,మోహన్ రెడ్డి,రాఘవ రెడ్డి,యూత్ కాంగ్రెస్ కోటేశ్,షర్ఫుద్దీన్,బిక్షపతి చారి తదితరులు హాజరై మైనంపల్లి హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మైనంపల్లి హనుమంతరావు ప్రజా సమస్యల కోసం నిరంతరం పాటుపడుతూ పరిష్కారం కోసం కృషి చేస్తున్న, పార్టీ అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ఆయనకు పార్టీలో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఇప్పుడిప్పుడే మొదలవుతున్న సర్పంచ్ అభ్యర్థుల సందడి.

**రానున్న స్థానిక ఎన్నికల్లో యువత వైపే మొగ్గు చూపుతున్న ఓటరు..**
**ఎన్నికల బరిలో దిగేందుకు యువత,నాయకుల ఆసక్తి..**
**సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానంపై దృష్టి..**
**గ్రామాల అభివృద్ధి యువతతోనే సాధ్యం..**
**సీనియర్లకు చుక్కెదిరేనా.?**




**కొల్చారం,జనవరి10 (సూర్యరేఖ)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పుడిప్పుడే సర్పంచ్ అభ్యర్థుల సందడి మొదలవుతుంది. యువత సన్నద్ధం కావాలని,రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా,మహనీయులను, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత అత్యధికంగా బరిలో నిలిచి,గ్రామాల అభివృద్ధి'యే యువతతో సాధ్యం అవుతుందని వివిధ గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ, తెలంగాణా తొలి,మలిదశ ఉద్యమం అనేది విద్యార్థి,నిరుద్యోగ యువత తోనే ఉప్పెనలా ఎగిసిపడి యావత్ తెలంగాణ సమాజాన్నే చైతన్యం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో యువత పాత్ర అమోఘం,అద్భుతం అన్నారు. గుర్తెరిగి తెలంగాణ ఉద్యమాన్ని,మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో అందరికి ఆదర్శంగా ఉంటూ,ఎలాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా,రాజకీయ పార్టీల నాయకుల మాటలకు,వారి ప్రలోభాలకు లొంగకుండా,గ్రామాల అభివృద్ధి యువత'తోనే సాధ్యం అవుతుందని,ప్రతి యువతి,యువకులు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసి యువ శక్తి సత్తా ఏంటో నిరూపించుకోవాలని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. యువకులు వివిధ గ్రామాలలో ప్రజలతో పరిచయాలు పెంచుకుంటున్నారు. మీకు ఏ సమస్య ఉన్నా మీకు అండగా ఉండి ఆదుకుంటామని ప్రజలకు వివరిస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనాప్పటికీ జరగబోయే స్థానిక ఎన్నికల్లో సీనియర్లకు ప్రజలు ప్రాధాన్యత ఇస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారనుంది.

## జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు..

**రామాయంపేట,జనవరి10(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన విద్యార్థినిలు పలు రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ... సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభాను ముగ్గుల రూపంలో బయటకు తీయడం ఎంతో అభినందనీయమని చెప్పారు కార్యక్రమంలో మహిళా అధ్యాపకురాలు శ్రీదేవి, మంగ,తదితరులు ఉన్నారు.



## ప్రాథమిక పారశాల బాల్యాతండాల్ సంక్రాంతి సంబరాలు..



**రామాయంపేట,జనవరి10(సూర్యరేఖ)** ప్రాధమిక పాఠశాల బాల్యాతండాలీ సంక్రాంతి సందర్భంగా విద్యార్థులు అందమైన రంగవల్లులను వేయడం జరిగింది. అనంతరం చిన్నారులు గాలిపతూలను ఎగరవేసి సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సంతోష్ కుమార్, సహోపాధ్యాయుడు ఎస్.రాంప్రసాద్, ఏఏపీసి చైర్మన్ భారతి, నర్సింగ్,రాజేందర్,భిక్షపతి,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు

**పాల్గొన్న నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ దంపతులు**



**ఉప్పల్,జనవరి10 (సూర్యరేఖ)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా నాచారం హెచ్ఎంటి నగర్ లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ దంపతులు, మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...శ్రీ మహావిష్ణువుకు అత్యంత ఇష్టమైన ధనుర్మాసం ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలు,అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించి..అందరూ సుఖసంతోషాలతో విరసిల్లాలని ఆ భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు.

## శ్రీ కరిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్పొరేటర్ రజిత రెడ్డి దంపతుల పూజలు..



**ఉప్పల్,జనవరి10(సూర్యరేఖ)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉప్పల్ లోని శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు శ్రీనివాస్ శర్మ,వెంకటేశ్వర పంతులు శ్రీనివాస్ పంతులు,మధుకర్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,హనుమంత్,శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్,ఆనంద్,సంతోష్,చారి,రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయ కమిటీని సత్కరించిన

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ జలీల్ పాషా**





**ఉప్పల్,జనవరి10(సూర్యరేఖ)**శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో నూతన కమిటీ,చైర్మన్,ధర్మకర్తలను శుక్రవారం ఆలయంలో ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ.జలీల్ పాషా ఘనంగా సత్కరించారు. దేవాలయ ట్రస్టీ చైర్మెన్ నర్సింహా రెడ్డి,ఆలయ ధర్మకర్తలు గూడామణి విజయ్ భాస్కర్ గంగ పుత్ర,ముత్యాల బాబు,బులెట్ అశోక్,పూస సత్యనారాయణ,అంబికాలను జలీల్ పాషా శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆలయ కమిటీ,చైర్మన్,ధర్మకర్తలు ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వల్లపు శ్రీకాంత్ యాదవ్, యాదిరెడ్డి, జంగారెడ్డి,భాస్కర్, రబ్బాని, రఫిక్ బాయ్,అంజయ్య,చెంచుల్, తదితరులు పాల్గొన్నారు.

# తండాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు







**రామయంపేట,జనవరి10(సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలోని కాట్రియాల, పర్వతాపూర్,దంతేపల్లి,కాట్రియాల తండా విద్యార్థులు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు పలు గ్రామాల నుండి 6 కిలోమీటర్ల దూరంలోని కాట్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉదయం సాయంకాల వేళల్లో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు దంతేపల్లి నుండి రామాయంపేట జూనియర్ కళాశాలలో చదువుకోవడానికి వెళ్తున్న సుమారు 15 మంది విద్యార్థులు లక్ష్మాపూర్ గేటు వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతిరోజు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

# శ్రీ సీత రామచంద్ర స్వామి ఆలయంలో పరమేశ్వర్ రెడ్డి దంపతుల పూజలు





**ఉప్పల్,జనవరి10 (సూర్యరేఖ)**వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉప్పల్ శ్రీరామకాలనీ లోని శ్రీసీత రామచంద్ర స్వామి ఆలయంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు మోత్కూరి రాఘవదాస్ శర్మ ,మోత్కూరి కృష్ణ శర్మ,మోత్కూరి ప్రసాద్,మోత్కూరి హరీష్ విజయేంద్ర,మోత్కూరి అక్షయ్ శర్మ,నెల్లూరి మల్లికార్జున్ శర్మ,బల్వంత్ రెడ్డి,మెనంపల్లి మురళి గౌడ్,రాఘవేందర్ పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయండి..





**జిహెచ్ఎంసి కమిషనర్ ను కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జనవరి10(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పది డివిజన్లో పెండింగ్ పనులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. డివిజన్లో పెండింగ్లో ఉన్న పనుల వివరాలను కమిషనర్ కు ఎమ్మెల్యే వివరించారు. సానుకూలంగా స్పందించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి,శాంతి సాయిజన్ శేకర్,ప్రభుదాస్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కున అందజేసిన బీజేపీ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి

**ఉప్పల్,జనవరి10 (సూర్యరేఖ)** అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహానిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) బీజేపీ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. రామంతపూర్ వెంకట సాయినగర్( సాయికృష్ణానగర్)చెందిన జ్యోతి భర్త శివ, బాలకృష్ణనగర్ కు చెందిన మానస తండ్రికి శుక్రవారం రూ.42 వేలు, రూ 29 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం లాంటిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఏ.విజయేందర్ రెడ్డి, ఐలేష్ యాదవ్, రమేష్,రాజు, శివ,ఆర్. గోవింద్, సిహెచ్ శ్రీనివాస్ గౌడ్, అశోక్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ వేడుకలు..





**నిజాంపేట,జనవరి10(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు,గాలిపటాలు ఎగర వేయించామని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ అన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ విశిష్ట గూర్చి విద్యార్థులకు వివరించామన్నారు.విద్యార్థులచే ముగ్గుల పోటీలు హరిదాసు వేషధారణ,ద్వారా పండుగ ప్రాముఖ్యతను వివరించామన్నారు.అలాగే విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి గాలిపటాలు ఎగర వేశామన్నారు.ముందస్తుగా నిజాంపేట మండల గ్రామ ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేందర్,శ్రీనివాస్,శ్రీకాంత్ గౌడ్,ప్రమీల,శ్రీలత,బాల్ లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..



**నిజాంపేట,జనవరి10(సూర్యరేఖ)** మండల పరిధిలోని వెంకటాపూర్ కె గ్రామానికి చెందిన సోమన్నగారి కృష్ణ,కు ఆరోగ్యరీత్యా వైద్య పరీక్షల నిమిత్తం రూ.46 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు సహకరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,భాస్కర్ గౌడ్,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## మంగాపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పరమేశ్వర్ రెడ్డి పూజలు..



**ఉప్పల్,జనవరి10 (సూర్యరేఖ)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మీర్ పేట్ హెచ్ బి కాలనీలోని శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట్ రెడ్డి,కార్పొరేటర్ ప్రభుదాస్,గుండారపు శ్రీనివాస్ రెడ్డి,పోలపాక అంజయ్య,ఉదయ్ కిరణ్,అనిల్ గుప్తా,సురేష్ గౌడ్,బాలయ్యగౌడ్,సురేష్ గౌడ్,మురళి పాల్గొన్నారు

## విద్యార్థులకు టై,బెల్టుల పంపిణీ..





**శివంపేట,జనవరి10 (సూర్యరేఖ)** శివంపేట మండలం పిల్లుట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లుట్ల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బుర్ర మురళి గౌడ్ విద్యార్థిని విద్యార్థులకు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు టై బెల్టులు పిల్లుట్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పిల్లుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు రాఘవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి నాగేష్,బెస్త కిష్టయ్య,పిల్లి వెంకటయ్య,గులయ్యగారి రాములు, సంద్ర లక్ష్మయ్య,పిల్లి అంజయ్య,పెద్దపులి దుర్గయ్య,కర్రీ రమేష్ రమేష్ గౌడ్,పిల్లుట్ల విద్యా కమిటీ చైర్మన్ పిల్లి మధు,బొమ్మిడాల శంకర్,పెద్దపల్లి సతీష్,దినేష్ రెడ్డి,బాసంపల్లి నరసింహులు, గురయ్యాగారి రవి,కమ్మరి వినయ్,పిల్లి సుధాకర్ సంద్ర విష్ణు,బండారి శ్రీకాంత్,మస్కూర్ కన్నయ్య కమ్మరి మధుసూదన్,బోను స్వామి,గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# మంజీర విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు









**రామయంపేట,జనవరి 10 (సూర్యరేఖ)** స్థానిక మంజీరా విద్యాలయంలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా విద్యార్థినిలు రంగవల్లుల పోటీలో పాల్గొని చక్కగా ముగ్గులు వేయడం జరిగింది.చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోసి వాళ్లని ఆశీర్వదించడం జరిగింది. భోగిమంటలు వేసి పతంగులు ఎగురవేసి పాఠశాల అంతా పండుగ వాతావరణంతో నృత్యాలతో మారుమోగింది.ఈ సందర్భంగా వాసవి మాట్లాడుతూ... విద్యార్థులకు సంక్రాంతి పండుగ ఎందుకు జరుపుకుంటాము అనేది వివరించడం జరిగింది.సంక్రాంతి అంటే మిక్కిలి క్రాంతి. కొత్త క్రాంతి మన జీవితాలలో వెలుగును నింపుతుందని,సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి అడుగుపెడుతున్నటు వంటి కాలమిది.అందుకే ఈ పండుగను మూడు రోజుల పాటుగా జరుపుకుంటారు.మొదటి రోజున భోగిగా జరుపుకుంటారు. భోగి రోజు ఇంట్లో ఉండేటటువంటి పాత వస్తువులు అన్నిటిని మంటలుగా వేస్తారు. నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద మంటగా వేసి చీకటిని పారదోలి దారిద్రం అంతా తొలిగిపోయి నూతన విధానాలకు నాందిగా జరుపుకుంటారు. చిన్నపిల్లలకి ఆ రోజు సాయంత్రం సూర్యునికి ప్రీతిపాత్రమైనటువంటి పండగ కావున రేగిపల్లతో, నాణెలతో చెరుకు గడలతో,పూలు పళ్ళు కలిపి పెద్ద వాళ్ళందరూ చిన్నపిల్లలపై వేసి వాళ్లకి సూర్య భగవానుని అనుగ్రహం ప్రసాదించాలని దీవిస్తారు.రెండవ రోజు సంక్రాంతి పండగ జరుపుకుంటారు సంక్రాంతి రోజు ఇంటి ముందు ఉదయాన్నే పేడతో అలికి చక్కని ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి ఇంటి ముందు పాలు పొంగించి అంతా మంచే జరగాలని కోరుకుంటారు.రకరకాల పిండి వంటలు చేసుకుంటారు.చలి నుంచి కాపాడుకోవడానికి శరీరానికి శక్తిని ఇచ్చేటటువంటి బెల్లముతో తయారుచేసినటు వంటి నువ్వుల ఉండలు, అరిసెలు ఇలాంటి పిండివంటలు ఎక్కువగా చేసుకుంటారు. ఈ సమయంలో హరిదాసులు, జంగమవార్లు గంగిరెద్దుల వారు,బుడుగు జంగమ వారు అనేక మంది కళాకారులు ప్రతి ఇంటి ముందుకు వచ్చి భిక్ష తీసుకొని ఆశీర్వదించి వెళ్తారు. సాక్షాత్ శ్రీమహావిష్ణువు వచ్చినట్టుగా భావించి బిక్ష వేస్తారు. మూడవరోజు కనుమ రోజు ఇంటి ముందు వ్రతం ముగ్గులు వేసుకుంటారు. వ్యవసాయంలో తమకు చేదోడు వాదోడుగా ఉండే పశువులను పూజిస్తారు.పశువుల పండగగా దీనికి పేరు వ్యవసాయపు పనులు మళ్లీ రోజు నుంచి మొదలు పెడతారు. ధాన్యం చేతికి వచ్చేటటువంటి సమయం కావున ఈ పండుగను ప్రతి ఒక్కరు,ప్రతి ఇంటి వాళ్ళు ఉత్సాహంగా, సంతోషంగా చేసుకుంటారు. కోడి పందాలు,పేరంటాళ్ళు పతంగులు ఎగురవేయడం,పిల్లలు పెద్దలు అందరూ ఉత్సాహంగా చేసుకునే పండగ..ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి వాసవి,మౌనిక,మీనా,శ్రీశైలం సంధ్య, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## రామంతపూర్ డివిజన్ లో రూ.15 లక్షలతో యూజీడీ పైప్ లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే





**ఉప్పల్,జనవరి10 (సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ శ్రీనగర్ కాలనీలో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్(ఎస్ పి డి ) కింద మంజూరైన రూ.15 లక్షలతో యూజీడీ పైప్ లైన్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. నియోజకవర్గంలో అత్యవసరమైన చోట స్పెషల్ డెవలప్మెంట్ కింద పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అనంతరం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు మాట్లాడుతూ. డివిజన్ అభివృద్ధి కోసం సంబంధిత అధికారులను కలిసి అవసరమైన నిధులు తీసుకువస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండారు వెంకటరావు,డివిజన్ ప్రధాన కార్యదర్శులు సంకూరి కుమారస్వామి,ఉలుగొండ నారాయణదాసు, పలుగుల అంజయ్య పటేల్, తమ్మలి రవి, కొండ కృష్ణమూర్తి, పర్యవేద వెంకట్రావు, కల్మకల్ల లింగం, దర్శనాల సుధాకర్, పడిగం నాగేష్, రాంబ్రహ్మం,శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు దండు సంతోష్, ఉపాధ్యక్షు లు పాశం బాలరాజ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మస్ భాష,తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ర్యాలీ.

**రామాయంపేట,జనవరి10(సూర్యరేఖ)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రామయంపేట శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిద్దిపేట మెదక్ జిల్లా సంఘటన మంత్రి లక్ష్మీపతి మాట్లాడుతూ... భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండుల లో యోగ,వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయము చేసిన ఖ్యాతి అతనికి ఉంది. గురువు కోరిక మేరకు అమెరికాకు వెళ్ళి ఎన్నో ఉపన్యాసాలు చేశాడు.భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానందఅతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది.ప్రతి ఒక్క విద్యార్థి మహనీయుని బాటలో నడవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి ప్రశాంత్ నగర కార్యదర్శి హరిహర, సంయుక్త కార్యదర్శి నవీన్, అర్జున్,సాయి, కార్యకర్తలు ఆదర్శ్ కిరణ్,నరేందర్, సైఫ్ శశాంక్,వంశీ దీక్షిత్,తదితరులు పాల్గొన్నారు.



## చాకరిమెట్ల ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు..







**శివంపేట,జనవరి10 (సూర్యరేఖ)**శివంపేట్ మండలంలోని చాకరిమెట్లలో వెలిసిన శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని దర్శనానికి వచ్చే భక్తులకు ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ శర్మ మాట్లాడుతూ...వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించమని,చాలా ప్రత్యేకమని ఆయన తెలియజేస్తారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన

**శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్**







**రాజేంద్రనగర్,జనవరి 10** వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాజేంద్రనగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజలకు శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గోపాల్,బాలకృష్ణ,సుజీత్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు..



**రామాయంపేట,జనవరి 10 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు 59వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ చౌరస్తాలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు మాట్లాడుతూ...ప్రముఖ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు భగవంతుడి కృప కటాక్షములు ఉండి,ఈ మెదక్ నియోజకవర్గంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్న ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆక్షాంచించారు.ఈ సందర్భంగా కార్యకర్తలు సమిష్టి గా మైనంపల్లి హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియపరచారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుప్రభాత రావు,విప్లవ్ కుమార్,దేమే యాదగిరి,శ్రీధర్ రెడ్డి,దేవుని జయరాజ్,చిలుక గంగాధర్,అల్లాడి వెంకటేష్ శంకరయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ యువజన దినోత్సవం సంక్రాంతి రంగోలీ పోటీ..





**ఉప్పల్,జనవరి 10 (సూర్యరేఖ)** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 28వ జాతీయ యువజన దినోత్సవంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకుంటున్నారు. సభాధ్యక్షులు ప్రిన్సిపాల్ డా. కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ... "అపారమైన విశ్వాసం,అనంతమైన ప్రయత్నం విజయానికి మార్గాలు" అన్న నినాదాన్ని ఉల్లేఖించారు.విధేయత, సంసిద్ధత,పనిమీద శ్రద్ధాభక్తులు అత్యంత అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలుగా నిలిచిన సిహెచ్ యమున (బికాం),జి.కళ్యాణి (బిఏ), టి.నవ్యశ్రీ (బిఎస్సీ)లకు బహుమతులు ధృవపత్రాలు అందించారు. యువజనోత్సవాలలో సేవలు అందించిన ఎంజెపీ బిసీ గురుకుల జూనియర్ కళాశాల పిడి పవన్ ని కళాశాల అధ్యాపక సిబ్బంది సన్మానించారు.పాటలతో అలరించిన గాత్రిని, నందకిషోర్‌లను అభినందించారు. మహిళా సాధికారత విభాగం తరపున నిర్వహించిన సంక్రాతి ముగ్గులపోటీలో.. ఎం.హేమలత రూత్ ఏంజెల్ (బికాం), బి.సంధ్య ఎన్.సౌమ్య (ఎంపిసిఎస్), కె.శ్రేయ ఎం.హరిత (బిఏ) విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్, మహిళాసాధికారతా విభాగం సమన్వయ కర్త డా. ఎన్.రాజశ్రీ,ఎన్ఎస్ఎస్ పిఓ జె.విశ్వనాథ్ కుమార్, అకడమిక్ కో-ఆర్డినేటర్ కె.గీత, డా.సిహెచ్ సత్యనారాయణ, డా.జి.తిరుపతయ్య, డా.యమున,డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్.చంద్ర సాగర్, పి.ధనలక్ష్మి,డా.ఎల్ చంద్రకళ, పి.వెంకటేశ్వర్లు, కె.శ్రీదేవి, మమత,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు జన్మదిన వేడుకలు





**నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేసిన శ్రీధర్ రెడ్డి**

**రామాయంపేట,జనవరి10(సూర్యరేఖ)**రామయంపేట పట్టణంలో పాట ఆయా గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకుగారి శ్రీధర్ రెడ్డి నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేయడం జరిగింది. రాయపూర్ గ్రామంలో అన్నదాన కార్యక్రమం చేపట్టి కార్యకర్తలు నాయకులు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం జరిగింది. రామయంపేటలో టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో హనుమంతరావు జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా రామయంపేటలో కేక్ కట్ చేసి కార్యకర్తలతో జన్మదిన వేడుకల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేయడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.తమకు తోచిన విధంగా నిరుపేదలకు పార్టీతో పాటు హనుమంతరావు సేవలు అందేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు కిటకిటలాడిన ఆలయాలు






**నిజాంపేట,జనవరి10(సూర్యరేఖ)** మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలను కిటకిటలాడాయి. ఈ మేరకు మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ తిరుమలనాథ దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించామని ఆలయ ఈవో రవి కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం తిరుమల స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని,ఈ వేడుకలకు గ్రామ ప్రజలే కాకుండా చుట్టుముట్టు గ్రామ ప్రజలు విచ్చేసి స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులయ్యారని తెలిపారు. అలాగే సోమవారం గోదాదేవి కళ్యాణ మహోత్సవం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని,ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్,తిరుమల స్వామివారిని దర్శించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులువెంకట రామ్మోహన్ శర్మ,నాగరాజ్ శర్మ,ఆలయ చైర్మన్ అక్కల రామ్ రెడ్డి,డైరెక్టర్లు బాజా రమేష్,ఎల్లాగౌడ్, రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్, కుర్చీలు అందజేత..



**శివంపేట,జనవరి10 (సూర్యరేఖ)** శివంపేట మండలంలోని దొంతి వేణుగోపాలనగర్ లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు పేరిక వెంకటేశం తన సొంత డబ్బుతో వాటర్ ఫిల్టర్, కుర్చీలు,గోడ గడియారం పాఠశాల ఉపాధ్యాయురాలు నర్మదాకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు ముత్యాలు,ఉపాధ్యాయురాలు స్వప్న,విద్యార్థిని,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు..



**హైదరాబాద్,జనవరి10 (సూర్యరేఖ)** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా చార్మినార్ దగ్గర ఉదయం జన్మదిన వేడుకలు నిర్వహించారు.కేక్ కట్ చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ హాజరయ్యారు. బన్సీలాల్ పేట్ లో అనాథులైన హ్యాండీక్యాప్స్ కు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గాంధీ హాస్పిటల్ దగ్గర కేక్ కటింగ్ చేసిన అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్ రెడ్డి,పాశం అనిల్ యాదవ్, జగదీష్,లక్ష్మీకాంత్ రెడ్డి,గడ్డం రవి,బాబురావు,బాబ్జి, తోని,సురేష్ యాదవ్, రమేష్ యాదవ్,వినయ్,బిపిన్ మరిశెట్టి నర్సింగ్,శివ,చిన్న యాదవ్,సాయి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పరమ పవిత్రం వైకుంఠ పర్వదినం..ఉత్తర ద్వార దర్శనం..సర్వదా శుభదాయకం

**తిరుమల వెంకటేశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్,జనవరి10(సూర్య రేఖ)** వైకుంఠ ఏకాదశి పర్వదినం ప్రజలకు సకల పాపలను హరిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు.పరమ పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినంను పురస్కరించుకొని భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...శ్రీ మహావిష్ణువుకు అత్యంత ఇష్టమైన ధనుర్మాస ఏకాదశి అని, స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గం ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.వైకుంఠ ఏకాదశి పర్వదినంను పురస్కరించుకొని శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని వివరించారు.

## హరిహర క్షేత్రం వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న తహశీల్దార్ రాములు



**రాజేంద్రనగర్,జనవరి10** వైకుంఠ ఏకాదశి సందర్భంగా హరిహర క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆలయాన్ని రాజేంద్రనగర్ మండల తహశీల్దార్ రాములు వెంకటేశ్వర స్వామి దేవాలయంను దర్శించుకున్నారు.దీంతో పాటు మాజీ బోర్డు మెంబర్ పచ్చ శ్రీనివాసులు,బిజెపి నాయకులు వై. శ్రీధర్,ఇద్దపూర్ వేణు,పతియారా,నరసింహ,ఆర్ఐ సునీత,సోమరాజు,కన్యాకుమారి వెంకటేశ్వర స్వామి దేవాలయంను సందర్శించారు.

# ఘనంగా మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు జన్మదిన వేడుకలు..






**నిజాంపేట,జనవరి10(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, అలాగే చల్మెడ గ్రామంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయంలో శుక్రవారం మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా నిజాంపేట రేణుక ఎల్లమ్మ, చల్మెడ తిరుమల స్వామి, ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నామన్నారు.శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి, తిరుమల స్వామి, కృపతో అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని మరెన్నో ఉన్నత పదవులు అదిరోహించాలన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం రెడ్డి, నసీరుద్దీన్, పంజా మహేందర్, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, కొమ్మాట సత్యనారాయణ,ఆలయ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి,డైరెక్టర్ బజా రమేష్, రాజిరెడ్డి, ఎల్లాగౌడ్, కాకి రాజయ్య, అబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి,వెంకటేష్ గౌడ్, వినోద్, శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్,భాస్కర్ గౌడ్, సులేమాన్, మల్లేశం, తుమ్మల రమేష్, సూర్య, రమేష్, భూమాగౌడ్,సూర రాములు, తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లి హనుమంతరావు జన్మదిన సందర్భంగా కలర్లు పంపిణీ చేసిన కౌన్సిలర్.








**రామాయంపేట,జనవరి10 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డ్ లో శుక్రవారం కౌన్సిలర్ చిలుక గంగాధర్ ముగ్గులు పంపిణీ చేశారు.మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన పురస్కరించుకొని సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇంటింటికి వెళ్లి రంగుల ప్యాకెట్లను అందజేశారు.ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసుకునే విధంగా రంగులు పంపిణీ చేసినట్లు కౌన్సిలర్ గంగాధర్ తెలిపారు.శుక్రవారం జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న మైనంపల్లి హనుమంతరావు ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాని తెలిపారు. రామాయంపేట అభివృద్ధికి, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు మైనంపల్లి హనుమంతరావు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రామాయంపేట అభివృద్ధికి ఏ ఒక్క నాయకుడు కృషి చేయలేదని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో రామాయంపేట అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిలక గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం వెంకట్ రెడ్డి, చిలుక స్వామి,తదితరులు పాల్గొన్నారు.

# మనసు దోచిన మహిళల సంక్రాంతి ముగ్గులు..






**రాజేంద్రనగర్ ఉప్పరపల్లి 8 వ మెట్రోపాలిటన్ కోర్టులో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు..**



**రాజేంద్రనగర్,జనవరి 10** మకర సంక్రాంతి సందర్భంగా రాజేంద్రనగర్ ఉప్పరపల్లి 8 వ మెట్రోపాలిటన్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు.కోర్టు ఆవరణలో మహిళ న్యాయవాదులు పోటీలు పడి ముగ్గులు వేశారు.ఆ ముగ్గులకు రంగులు అద్ది అందంగా అలంకరించారు.రంగవల్లికలు చూపరులను ఆకర్షించే విధంగా ముగ్గులు వేశారు.మహిళలు వేసిన తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. కోర్టు ఆవరణ సంక్రాంతికి ముగ్గులతో స్వాగతం పలికింది. ముగ్గులను మేజిస్ట్రేట్ నీలం,జిల్లా జడ్జి ఆంజనేయులు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులు ప్రదర్శించిన ముగ్గులను పరిశీలించి ఎంపిక చేశారు.ఈ పోటీల్లో మొదటి బహుమతులు గెలుపొందిన మహిళ న్యాయవాదులు భానుప్రియ,సునీత, ప్రియాంక శరవాణి, సుజాత, మౌనిక, వషాణి,ప్రియానక్, ద్వితీయ బహుమతి సునీతకు దక్కించుకుంది. మహిళలు ముగ్గులు వేయడంపై ఆసక్తపి పెంపొందించడంతోపాటు, సంప్రదాయాలను మర్చిపోకుండా ఇలాంటి పోటీలను నిర్వహించడం వల్ల వారిలో మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. భారతీయ సంప్రదాయంలో ముగ్గులకు ఎంతో ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ముగ్గును శుభానికి, మంగళత్వానికి ప్రతీకగా భావిస్తారని, లక్ష్మీదేవికి ఆనందాన్ని కలిగించే అంశాలలో రంగవల్లు ఒకటని అన్నారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి టి.ఎల్.శ్రీధర్ రెడ్డి, నాయక్,బండయ్య, ప్రతాప్, కృష్ణ,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి..

**వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అమ్మపల్లి సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని దర్శించిన బీజేపీ రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్**





**శంషాబాద్,జనవరి10** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి(అమ్మపల్లి) దేవాలయాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జూకల్ మాజీ ఎంపీటీసీ బుక్క ప్రవీణ్ కుమార్,నర్కుడ మాజీ సర్పంచ్ సునిగంటి సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలై యాత్రకు తరలిన అయ్యప్ప స్వాములు



**రాజేంద్రనగర్,జనవరి10**శబరిమలై అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు రాజేంద్రనగర్ సర్కిల్ ఎఱ్ఱబొడ నుండి మండల దీక్షను పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు నాయిని వెంకటేష్ గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమల యాత్రకు బయల్దేరారు.ఎర్రబోడ గ్రామం సప్తగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ఇరుముడులు కట్టుకుని స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తి శ్రద్ధల మధ్య అయ్యప్ప స్వాములు ఇరుముడులు కట్టుకుని భక్తులకు అన్నప్రసాధ వితరణ నిర్వహించారు.ఎలాంటి భయానక,ప్రాణాంతక వైరస్ లు భారతదేశంలో వ్యాపించకుండా ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించేలా కరుణ చూపు అయ్యప్ప అంటూ యాత్రను ప్రారంభించారు.వారి యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధానకార్యదర్శి సాయి యాదవ్ ఆకాంక్షించారు. శబరిమల యాత్రకు వై.కిరణ్ చారి,వై.రవీంద్ర చారి,వై మనీంద్ర చారి,వీ హనుమంతు,పీ హర్షిత్ చారి,ఎం శ్రీధర్, బీ.రాహుల్, బీ.విజయ్, మోహన్, ఎస్.నవీన్ తదితరులు తరలివెళ్లారు.

## చిన్న ఘనపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు...

**- పతంగులు ఎగరేసిన విద్యార్థులు,ముగ్గులు వేసిన విద్యార్థినిలు....**




**కొల్చారం,జనవరి10(సూర్య రేఖ)** కొల్చారం మండలం చిన్న ఘనపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సిద్ధ లక్ష్మి మాట్లాడుతూ..సంక్రాంతి పండుగ అనేది సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడం వల్ల జరిగే మకర సంక్రమణంనే మకర సంక్రాంతిగా తెలుగు ప్రజలు జరుపుకునే ఎంతో ప్రాముఖ్యమైన విశిష్టమైన పెద్ద పండుగ అని,పండుగలు అనేవి మన సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండా విద్యార్థులకు పండుగలు ప్రాముఖ్యతను విశేషాన్ని తెలియజేయడానికి సందర్భోచితంగా, ఉపయోగకరంగా ఉంటాయని,చిన్న ఘనపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ లక్ష్మి అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల రంగవల్లులు వేశారు.పాఠశాలలోని విద్యార్థులు సంక్రాంతి పండుగలో భాగమైన పతంగులను ఆనందంగా ఎగరవేశారు.అనంతరం భోగిమంటలు పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ లక్ష్మితో వేయించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ,ప్రియాంక,ప్రమీల,సరిత,దివ్య,పాఠశాలలోని విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రంగవల్లుల్లో ఉత్తమ ముగ్గులకు బహుమతులు ప్రదానం చేశారు.

# జిమ్‌లో గాయపడిన రష్మిక.. ఇప్పుడెలా ఉందంటే.?



నేషనల్ క్రష్ రష్మిక మందన్నాకి ప్రమాదం జరిగింది. రష్మిక జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తుండగా.. కాలికి గాయం అయినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై డాక్టర్‌ను కలువగా.. గాయం చిన్నదే అని.. పెద్దగా ప్రమాదం లేదని చెప్పినట్లు తెలుస్తుంది. అయితే ఒక వారం పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో రష్మిక ప్రస్తుతం ఇంట్లో ఉండి రెస్ట్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవలే పుష్ప 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ భామ బ్లాక్ బస్టర్ హిట్‌ని అందుకుంది. ఇప్పటికే యానిమల్‌తో హిట్‌ని ఖాతాలో వేసుకున్న ఈ భామకి పుష్ప 2 తోడవడంతో రష్మిక రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. మరోవైపు ఈ ఏడాది రష్మిక నటిస్తున్న చిత్రాలలో చావా  సినిమా ఒకటి. విక్కీ కౌశల్ హీరోగా వస్తున్న ఈ సినిమా మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. ఇదే కాకుండా సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా వస్తున్న సికిందర్ చిత్రంలో కూడా కీలక పాత్రలో నటిస్తుంది ఈ భామ.

## డిటెక్టివ్‌గా మమ్ముట్టి

**‘డొమినిక్ అండ్ ది లేడీస్ పర్సు’ ట్రైలర్ చూశారా.!**

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డొమినిక్ అండ్ ది లేడీస్ పర్సు  తమిళ అగ్ర దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మమ్ముట్టి సొంత ప్రొడక్షన్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే మూవీ నుంచి ట్రైలర్‌ను వదిలారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే.. మమ్ముట్టి ఇందులో డొమినిక్ అనే డిటెక్టివ్ పాత్రలో నటించబోతున్నాడు. ఆసుపత్రిలో దొరికిన లేడీస్ పర్సుకి సంబంధించి ఈ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తప్పిపోయిన ఆ లేడీస్ పర్స్ ఎవరిది అని డొమినిక్ కనిపెట్టాడా.. ఇంతకీ ఆ పర్స్‌లో ఏముంది.. ఈ పర్స్‌కి మర్డర్స్‌కి సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. డా.నీరజ్ రాజన్ ఈ సినిమాకు కథను అందిస్తుండగా.. గోకుల్ సురేష్ , సుస్మితా భట్ , విజి వెంకటేష్ , వినీత్ , విజయ్ బాబు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్నారు.





# బీచ్‌లో సూపర్ ఛిల్‌గా అలియాభట్

గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారే భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ గతేడాది జిగ్రా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉంది. కాగా ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండే ఈ బ్యూటీ షూటింగ్ పనుల నుంచి బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం వెకేషన్ టూర్‌ను ఎంజాయ్ చేస్తోంది. ఈ భామ ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..? ప్రపంచ ప్రఖ్యాత టూరిజం స్పాట్స్‌లో ఒకటైన థాయ్‌లాండ్. బికినీలో థాయ్‌లాండ్ దీవుల్లోని సముద్రంలో జలకాలాడింది. సాగరతీరంలో విహరిస్తూ ప్రకృతిని అందాలను ఆస్వాదించింది. బ్లాక్ గాగుల్స్ పెట్టుకొని స్టైలిష్‌గా బోటు రైడ్ చేసింది. ఉదయాన్నే జిమ్ సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత తనకిష్టమైన పుస్తకం చదివింది. అలియాభట్ థాయ్‌లాండ్ వెకేషన్‌లో సూపర్ ఛిల్ అవుట్ మూడ్‌లో ఉన్న ఫొటోలు ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. అలియాభట్ ప్రస్తుతం అల్ఫా, లవ్ అండ్ వార్ సినిమాల్లో నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉన్నాయి.




# రాయలసీమ నా అడ్డా..

**పవర్‌ఫుల్‌గా ‘డాకు మహారాజ్’ రిలీజ్ ట్రైలర్**

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ 2023లో వాల్తేరు వీరయ్యతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రద్ధ శ్రీనాథ్, పగ్వా జైశ్వల్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌ను పంచుకున్న విషయం తెలిసిందే. అయితే రిలీజ్ ట్రైలర్‌ను ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో లాంఛ్ చేద్దాం అనుకున్నారు. కానీ తిరుమల తొక్కిసలాట ఘటనలో భక్తులు మరణించడంతో ఈ వేడుకను వాయిదా వేశారు. దీంతో రిలీజ్ ట్రైలర్‌ను నేడు వదిలింది చిత్రబృందం.

# అతడిని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది?

**ఇంట్రెస్టింగ్‌గా ఆదిత్య ఓం బంధీ**

లాహిరి లాహిరి లాహిరి సినిమాతో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు ఆదిత్య ఓం ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఈ యాక్టర్ 2023లో నాతో నేను సినిమాలో కీలక పాత్రలో నటించాడు. 2024లో పాపులర్ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 8లో కూడా సందడి చేశాడు. డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ కూడా అయిన ఈ నటుడు ప్రస్తుతం బంధీ సినిమాలో నటిస్తున్నాడు. ఈ మూవీలో ప్రకృతిని నాశనం చేస్తున్న కార్పొరేట్ కంపెనీలకు మద్దతుగా నిలిచే పాత్రలో ఆదిత్య ఓం కనిపించనున్నాడు. కార్పోరేట్ కంపెనీలకు న్యాయ సలహాదారుగా వ్యవహరించే పాత్రను పోషిస్తుండగా.. అతడిని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది..? అతడు ప్రకృతిని ఎలా కాపాడుతాడనే కాన్సెప్ట్‌తో సినిమా ఆసక్తికరంగా ఉండబోతుందని మేకర్స్ వెల్లడించారు. ఆదిత్య ఓం ఈ సినిమాలో ఎలాంటి డూప్స్ లేకుండా సొంతంగా యాక్షన్ సీక్వెన్స్‌లో కనిపించబోతున్నారని తెలియజేశారు. ఈ చిత్రానికి తిరుమల రఘు దర్శకత్వం వహిస్తున్నాడు. గల్లీ సినిమా బ్యానర్‌పై వెంకటేశ్వర్ రావు దగ్గు, తిరుమల రఘు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,